


**(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)**

జరిగిన కథ

**వంశీ, మహతి చిననాటి స్నేహితులు. ఒకే ఊళ్లో ఉంటారు. వంశీ, సీమల సంసారంలో వింత సంక్షోభం రగులుతూ ఉంటుంది. మహతికి రూమ్మేట్ గా మహతి, వంశీల చిన్నప్పటి మరో స్నేహితురాలు గౌతమి వస్తుంది. ముగ్గురూ కలిసి వంశీ అమ్మమ్మగారి ఊరు రావిపాడు వెళ్ళి జాతర చూసి వస్తారు. సీమ తో ఇక సరిపడదని వంశీ నిర్ణయించుకుంటాడు. మహతి ఆనంద్ తో లివిన్ రిలేషన్ షిప్ లో ఉంటుంది. గౌతమి వంశీని ఆకర్షిస్తుంది. వంశీ, సీమల గురించి గౌతమికి అర్థమయిందనే నిజం తెలుస్తుందతనికి. గౌతమి కి తన మనసు చెప్పమని వంశీని ప్రోత్సహిస్తుంది మహతి.**

## 15

నీటిధారల కింద నిలబడి ఉన్నాడు వంశీ. టైల్స్ మీద జారుతున్న నీళ్ళు లైట్ వెలుగులో మెలికలు తిరుగుతున్నాయి. నిముషాలు కరిగిపోతున్నాయి. అతని ఆలోచనలు చిక్కులు విడుతున్నాయి.

"నీకున్నదీ ఒకే ఒక్క జీవితం వంశీ.." మహతి మాటలు పదే పదే గుర్తొస్తున్నాయ్.

బాత్రూమ్ లోంచి టవల్ కట్టుకుని వచ్చి బాల్కనీలోకి నడిచాడు. ఆకాశంలో చుక్కలని చూడగానే గుర్తొచ్చే మహతి. 'జీవితం.. ఒకే ఒక్క జీవితం..' గుండెల నిండా గాలి పీల్చుకుని వదిలాడు.

గౌతమిని తలుచుకోకుండా ఉండడం, సీమతో ఒకే ఇంట్లో బతకడం కొన్నాళ్ళకి అలవాటైపోతాయా?

కోరుకున్న చదువు, ఉండాలనుకున్న ఊరు.. అలాగే జీవితంలో ప్రతీ విషయానికీ రాజీపడాలా?

నైట్ డ్రస్ లోకి మారి, కిందకి వచ్చి సోఫాలో కూర్చున్నాడు. గడియారపు ముళ్ళు నడుస్తున్నాయి.. తెల్లారేదాకా సెకన్లు గంటలై నడుస్తూనే ఉన్నాయి.

***

"Good Morning! Want to meet you before you leave." డిస్ప్లే లో నల్లటి అక్షరాలు.. వంశీ పంపిన అక్షరాలు..

"good morning! at home. why don't you drop by?"

వంశీ టెక్స్ట్ కి రిప్లై పంపే ముందు ఒక్క క్షణం ఆలోచించింది గౌతమి. కాలింగ్ బెల్ మోగేలోగా, ఆ పావుగంటలో ఫోన్ ఆటోలాక్ అవగానే మళ్లీ అన్లాక్ చేసి చూస్తూనే ఉంది అతని టెక్స్ట్ ని..

***

"కాఫీ?" కాగుతున్న పాల మీదనుండి దృష్టి మరల్చకుండా అడిగింది గౌతమి.

"యెస్. రెయిన్ చెక్ తీసుకున్నాను కదా! మళ్ళీ వెళిపోతున్నావు కూడా.. " తేటగా నవ్వాడు.

"గుర్తుంది." పాలు కప్పుల్లో పోస్తూ క్షణకాలం ఆగి చెప్పింది. "ఈ కప్ బాగా నచ్చింది నాకు. థాంక్స్ అగైన్."

'సౌత్ పా' అని రాసున్న ఆకుపచ్చ కప్ వైపు చూసి గుర్తుపట్టినట్టు తలూపాడు.

"ఏంటి ప్లాన్?" అడిగాడు కాఫీ సిప్ చేస్తూ..

"ఎల్లుండి ఈవెనింగ్ బయలుదేరుతున్నాను."

"ఊ.."

"రేపోసారి మహతిని కలిసి బై చెప్పాలి."

"ఊ.."

"అంతే."

ఇంకొన్ని నిముషాలు నిశబ్దంగా గడిచాయి. టీపాయ్ మీద ఉన్న పేపర్ తిరగేస్తూ గడిపాడతను. కాఫీ కప్ లో మిగిలి ఉన్న కాఫీచుక్కలని దీక్షగా చూస్తూ ఆమె..

"అల్రైటీ.. గుడ్ లక్!"
ఉలిక్కిపడి చూసింది. నిలబడి తననే చూస్తున్నాడు. కళ్ళు కలిసాయి.

సన్నటి కాటుక రేఖ దిద్దిన కళ్ళు .. వాటినిండా కాల్చేసే ప్రశ్నలు. ఏమని చెప్తాడు సమాధానం? చాలారోజుల తరువాత గాలిబ్ గుర్తొచ్చాడు వంశీకి.

*ఆమె కనులు నిశబ్దమ్ములయ్యు పలుకు*
*పలుకుటగ్గిని పొగయె కజ్జలము కాగ*
నిశబ్దంగా మాట్లాడే కళ్ళు . ఆ మాటల్లో అగ్నికి కాటుక పొగ.

చూపు మరల్చుకుని బయటికి నడిచాడు. లేచి గుమ్మం దాకా నడిచింది అతని వెనకే..

"ఫర్ యూ.." ఓ పేకెట్ చేతిలో పెట్టి బయటకి నడిచాడు.

విప్పి ఓ ఫోటో ఫ్రేమ్ బయటకి తీసింది. ఫ్రేమ్ లో మసగ్గా ఉన్న ఆ ఫోటో ఏంటో గౌతమికి అర్ధం కాలేదు. అటూ ఇటూ తిప్పి చూస్తూండగా మొబైల్ చప్పుడయింది.

*"That Pale Blue Dot... is the home. Will be there on it somewhere, even though you are away."*

వంశీ పంపిన టెక్స్ట్ మళ్ళీ మళ్ళీ చదువుతూండగా మెరిసింది అదేమిటో.. "Pale Blue Dot? చదివానెక్కడో!!" అనుకుంటూ గబగబా లేప్టాప్ ఆన్ చేసి గూగుల్ చేసింది. వికీ పేజ్ చదువుతూ ఉండగానే మరో టెక్స్ట్..

*"err.. Will be there on it.. thinking of you.."*

నిస్సత్తువగా కూర్చుండిపోయింది. ఆలోచిస్తూ..

***

రోజంతా అన్యమనస్కంగా, అస్తవ్యస్తంగా గడిపాడు. ఎదురుచూస్తున్న కాల్ రానే వచ్చింది. వింటున్నాడు. గౌతమి మాట్లాడడానికి ప్రయత్నిస్తోంది.

ఫోన్ పట్టుకుని నడుస్తూ నడుస్తూ ఓ చర్చి ఎదురుగా ఆగిపోయాడు. సాయంకాలపు గాలి వీస్తోంది. ఫోన్ చెవికి అతుక్కుపోతుందేమో అన్నంతగా నొక్కిపట్టాడు. మాటలు ఆగి ఆగి వినిపిస్తున్నాయి.. సందిగ్ధంగా..

"సిద్ధంగా ఉన్నాను." స్థిరంగా చెప్పాడు.
"ఐ.. లవ్ యూ.."
"మీ టూ.."

చాలాసేపు నిశబ్దాన్ని ఆస్వాదించారిద్దరూ..

"తెలుసు కదా అన్నీ.." నెమ్మదిగా అడిగాడు.
"ఊ.. "
"రేపు ఏమిటీ అనేది తెలీదు."
"విల్ వర్క్ ఇట్ ఔట్.. టుగెదర్." మెత్తగా చెప్పింది.
"ఏమైనా అడగాలంటే అడిగేసేయ్" రవ్వంత గిల్ట్ ధ్వనించిందతని గొంతులో
"ఇట్స్ ఓవర్ దేర్... కదా?"
"యెస్.. ఫర్ మీ ఇట్స్ ఓవర్ "
"ఏమైనా చెప్పాలనుకుంటే చెప్పేసేయ్. నాకేం ప్రశ్నలు లేవు." స్పష్టంగా చెప్పిందామె.
"ప్రపంచం దృష్టిలో క్రైమ్ ఇది."
"మనం మొదటివాళ్ళం కాదు వంశీ.."

కొత్త గౌతమి కనిపిస్తోందతనికి. 'నా మనశ్శాంతి నాకు ముఖ్యం!' అని ఉద్యోగం వదిలేసిన అమ్మాయేనా అని ఆశ్చర్యపోతున్నాడు.
"హేయ్.. యూ ఆర్ నాట్ కిడింగ్ మీ.. కదా?" అపనమ్మకంగా అడిగాడు.

"షటప్.."

"ఏం చెప్పాలో తెలియడం లేదు. చాలా మాట్లాడాలి. నా జీవితం.. నా సొంత జీవితం నా చేతుల్లో లేదు. కనబడని సంకెళ్ళు వేసేసుకున్నాను. ఇప్పుడవి తెంచుకోవాలనుకున్నా తెంచుకోలేనివి.. నాకు ఇష్టమై కాదు. అదీ ఐరనీ. అలా అని గాల్లో దీపం పెట్టి చేతులు ముడుచుకుని.. "

"వంశీ.." మధ్యలో ఆపేసిందతని మాటలని..

"చెప్పు.."

"మహతి కి ఆనంద్ కనిపించినట్టే.. నీకు నేను. ఒక్కటే తేడా.."

"ఐ గాట్ స్టకప్ ఇన్ ద హిందూ మేరేజ్ సిస్టమ్."

గౌతమి మౌనంగా ఉండిపోయింది. అతని మనసు అర్ధమై ఆమె మనసు మెలిపడింది.

"చూద్దాం ఏమవుతుందో! వీ నెవర్ నో."

"ఏమో.. గుర్రమెగరావచ్చు." అతని నవ్వులో బాధ జీర.

"వంశీకి రెక్కలు రానూ వచ్చు." చెప్పింది నమ్మకంగా..

"ఫింగర్స్ క్రాస్ డ్.." నవ్వాడు.

"సిస్టమ్ ని తప్పు పట్టను గౌతమీ.." చెప్పాడు తనే.

"ఊ.."

"మనకే పెళ్ళైతే, ప్రపంచంలో ఎవరూ మనని విడదీయలేరు కదా!" నిరాశగా ఉందతని గొంతు.

"నిజమే.. పెళ్ళి చెడ్డది కాదు. ఆ దొరికినవారు సరైన వారవడం, సరైన పర్సన్ దొరకడం.. దటీజ్ ప్యూర్ లక్!" నిట్టూర్చాడు.

"ఇంతకీ ఏవిటా అలుక్కుపోయిన ఫోటో! తమరు తీసారా?" టాపిక్ మారుస్తూ అల్లరిగా నవ్వింది.

"ఊ.. ఊ.. ఫోటోగ్రాఫర్ కి ఇస్తున్న గిఫ్ట్ కదా! ఏదో ప్రయోగం." నవ్వు దాచుకున్నాడు.

"బేడ్.. యూ సక్ ఎట్ ఫోటోగ్రఫీ"

"నేర్పుకో.. నేర్పుకో.." కవ్వించాడు.

కబుర్లు సంతోషంగా దొర్లిపోతున్నాయి. ఉన్నట్టుండీ చెప్పాడు.

"గౌతమీ.."

"ఊ.."

"లవ్ యూ.."

క్షణకాలపు నిశబ్దం తరువాత వినిపించామె గొంతు. స్థిరంగా.. మృదువుగా..

"వంశీ.. అన్నిటికీ.. ఎప్పటికీ.. నీతోనే.."

***

*వో అఫ్సానా.. జిసే అంజామ్ తక్ లానా, నహో ముమ్కిన్..*
*ఉసే ఏక్ ఖూబ్ సూరత్ మోడ్ దే కర్, తోడ్ నా హి బెహ్ తర్..*

*అయిపోయింది*

***ఆకాశమంత ప్రేమతో,***

***'మహతి'కి..***

(రచయిత్రి బ్లాగు http://kothavakaya.blogspot.com/)

COMMENTS